క్లుప్తంగా

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన గద్వాల నాయకులు



గద్వాల: పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో గద్వాల నాయకులు సోమవారం ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్సీని కలిశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, ఇసాక్, రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్, నాగేంద్రయాదవ్, భాస్కర్‌యాదవ్, మోహన్‌రావు, అచ్చన్నగౌడ్, డీటీడీసీ నర్సింహులు, పులిపాటి వెంకటేష్ ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ హరికృష్ణకు మర్యాదపూర్వకంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో డీటీ వెంకటరమణ, డీలర్లు విజయ్ కుమార్, రామంజనేయులు, సర్దార్, విజయ్, బాలకృష్ణ, ఖాజా, కాశీం, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి ఎస్‌ఐగా మహేష్

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐ శ్రీనివాసులు బదిలీ కావడంతో ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉండవెల్లి ఎస్‌ఐగా మహేష్ బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీకి ఆదరణ పెరుగుతోంది



అయిజ: బీజేపీకి ఆదరణ పెరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో 17వ వార్డులోని నరసింహా కాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ కన్వీనర్ ప్రదీప్ కుమార్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, రాజశేఖర్, రఘు, నరసింహులు పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు శివ, పరుష, ఆంజనేయులు, రాముడు, కృష్ణ, సూరి, మద్దిలేటి పాల్గొన్నారు.

బీరప్ప ఆలయంలో చోరీ

మానవపాడు: గుర్తు తెలియని వ్యక్తులు బీరప్ప ఆలయంలో చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని చెన్నిపాడు గ్రామంలో బీరప్ప ఆలయంలో 45తులాల వెండి, హుండీలోని నగదు చోరీ చేశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దళితులకు భూములు ఇవ్వాలి

అలంపూర్‌రూరల్: శ్రీశైలం నీటి మునక భూములు భూమిలేని దళితులకు పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేపల్లె దేవదాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అలంపూర్ మండలంలోని బీమవరంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు.

పైప్‌లైన్ నిర్మాణంలో వాగ్వాదం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో పైప్‌లైన్ నిర్మాణం చేపడుతుండగా కాంట్రాక్టర్, మున్సిపల్ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పదో వార్డులో డ్రెయినేజీ నీరు వెళ్లడానికి ఇటీవల రూ.లక్ష పనులకు కౌన్సిల్ తీర్మానం చేసింది. పనులను పదో వార్డు కౌన్సిలర్ భర్త సోమవారం మొదలు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది పనులు నిలిపేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కమిషనర్ పనులు ఆపాలని సూచించనట్లు తెలిపారు. దీంతో కాంట్రాక్టర్, మున్సిపల్ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా పనులకు వర్క్ ఆర్డర్ ఇవ్వలేదన్నారు. దీంతో పనులు నిలిపేయాలని సూచించినట్లు తెలిపారు.

హిందూ ధర్మ పరిరక్షణ సమితి ర్యాలీ

అయిజ: తిరుమలలో వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసిన అవినీతి పరులను వెంటనే శిక్షించాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అయిజ పట్టణంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భరత్‌రెడ్డి, చక్రవర్తి, నరసింహయ్య, తేజ, కృష్ణ, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు మోక్షమెప్పుడో?

- పేరుకే మండలం, సొంత భవనాల ఊసే లేదు
- అద్దె, పాత భవనాల్లోనే కాలం వెల్లదీత
- పట్టించుకోని అధికారులు, పాలకులు



అద్దె భవనంలో
ఎంపీడీఓ కార్యాలయం)



పాత సహకార భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

రాజోళి: మండలం ఏర్పాటు చేసినా ప్రభుత్వ కార్యాలయాలకు సొంతభవనాలు నిర్మించలేదు. మండలం ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా, రెండుసార్లు ప్రభుత్వం మారినా, నేటి వరకు భవనాల నిర్మాణం చేయలేదు. ఏళ్ల తరబడి ఎదురుచూసి, గత్యంతరం లేక కాలం చెల్లిన భవనాల్లోనే కాలం వెల్లదీస్తున్నారు. చిన్నపాటి ప్రభుత్వం భవనాలు నిర్మించినప్పటికీ అవి చిన్నపాటి ప్రయోజనాలకు మాత్రమే పరిమితమయ్యాయి. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయాలకు మాత్రం భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

అద్దె భవనాల్లోనే కాలం వెల్లదీత..

మండల కేంద్రం అనగానే ముందుగా గుర్తుకు వచ్చేవి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, కాని రాజోళిలో ఈ రెండు కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో నడుస్తుండగా, ఎంపీడీఓ కార్యాలయం అద్దె ఇంట్లో నడుపుతున్నారు. మహిళా సంఘం కార్యాలయానికి గతంలో నిర్మించిన డ్వాక్రా భవనంలోనే నడుపుతున్నారు. ఇక వెటర్నరీ భవనం కూలేందుకు సిద్ధంగా ఉండి, విష సర్పాలకు నిలయంగా మారిన దాంట్లోనే కాలం వెల్లదీస్తున్నారు. కొత్తగా ఎంఆర్‌సీ భవనం నిర్మించి అందులోనే ఉపాధి హామీ శాఖకు సంబంధించిన పనులు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక సహకార సంఘం ఇంకా ఉమ్మడి వడ్డేపల్లి మండల ప్రాతిపదికలోనే ఉంది. వడ్డేపల్లిలో ఉన్న కార్యాలయానికే రైతులు వెళ్లక తప్పడం లేదు. కాలేజీ కోసం ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నా, దానిపై నేటి వరకు ఎలాంటి చలనం లేదు. ఎంఈఓ కార్యాలయం ఉమ్మడిగానే కొనసాగడం, ఒకే అధికారి ఉండటంతో ఆ భవనాలకు నిర్మాణం జరగలేదు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి కూడా భవనం లేక పాత భవనంలోనే నడిపిస్తున్నారు.

పూర్తిగా శిథిలమవుతున్నాయి



మండల కేంద్రంలో ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయం పాత భవనంలో నడుస్తుండగా, ఎంపీడీఓ కార్యాలయం అద్దె భవనంలో నడుస్తోంది. అవి కూడా పాత భవనాలే. తహసీల్దార్ కార్యాలయంలో కడ్డీలు బయటకు తేలగా, పశుసంవర్ధక శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది.
– అడివి స్వామి, రాజోళి

మంత్రులకు వినతులు ఇచ్చాం.



గతంలో అప్పటి మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్, నిరంజన్ రెడ్డిలకు కొత్త భవనాల కోసం వినతి పత్రాలు అందజేశాం. వారు కూడా సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. కాని భవనాలు మంజూరు కాలేదు. ఈ ప్రభుత్వమైనా నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని ఆశిస్తున్నాం.
– మరియమ్మ, మాజీ ఎంపీపీ, రాజోళి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



మల్దకల్ తహసీల్దార్ కార్యాలయం
ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మల్దకల్: తమ భూములకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడంతో పాటు తమకు న్యాయం చేయాలని మండలంలోని పాల్వాయి గ్రామానికి చెందిన రైతులు మహ్మద్‌పాష, చిన్న ఖాజా, రంజాన్, మహేష్, సుధాకర్, బీసన్న, మరో 8మంది రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పాల్వాయి గ్రామ శివారులో 136, 137 సర్వే నంబర్లలో మొత్తం 24ఎకరాల వ్యవసాయ పొలంలో 15 ఎకరాలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు రాగా, మరో 9 ఎకరాలకు సంబంధించి ధరణిలో ఏర్పడిన సమస్యల వల్ల పట్టాదారు పాస్ పుస్తకాలు అందలేదన్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు రైతులు ఆ భూమిపై ఎలాగైనా పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది భూమిని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. 50ఏళ్లుగా తాము సాగు చేస్తున్నామని, ఏ రోజు పొలం వైపు కన్నెత్తి చూడని రైతులు ఆ భూమి తమదని కార్యాలయంలో దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. రెండు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌తో చర్చించగా వ్యవసాయ పొలాన్ని సందర్శించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం గిర్దావరి, సర్వేయర్‌ను పంపించి న్యాయం చేస్తానని చెప్పడంతో బాధిత రైతులు ఆందోళన విరమించారు.

జాగ్రత్తలు తప్పనిసరి



గద్వాల రూరల్: గర్భిణులు ఆరోగ్యపరంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యురాలు ఏంజెల్ అన్నారు. సోమవారం గద్వాల మండలంలో సంగాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ ఏంజెల్ మాట్లాడుతూ మొదటిసారి గర్భం దాల్చిన తరువాత పోషకాహారం తీసుకుంటే తల్లీ బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారని, తద్వారా సాధారణ కాన్పు అవుతుందని పేర్కొన్నారు. రక్తహీనతకు గురి కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ అశోక్ రెడ్డి, సూపర్‌వైజర్ విజయభాస్కర్, ఏఎన్ఎం రాధ, ఆశా కర్యకర్తలు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్‌గా సింధు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అందరికి అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తామన్నారు. మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనండి



వాల్ పోస్టర్‌లు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

శాంతినగర్: పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఈనెల 30న నిర్వహించే వేడుకలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు హరీష్, కార్యదర్శి శ్రీనులు కోరారు. శాంతినగర్‌లోని బీసీ హాస్టల్ ఆవరణలో సోమవారం 50 వసంతాల స్వర్ణోత్సవ సభల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో అఖిల్, పవన్, రాము, అరవింద్, జగదీష్, సుభాష్, రఘు, జశ్వంత్‌లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీఆర్ఏల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

అయిజ: తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మికి వీఆర్ఏలు వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీఓ 81, 85 వలన నష్టపోయామని తెలిపారు. వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో విష్ణు, రవికుమార్, కాంతకుమార్, కృష్ణయ్య, వెంకటయ్య, కాసప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కేటీదొడ్డి: మహిళలపై లైంగికంగా వేధింపులకు గురి చేసి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తులపై నిర్భయ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. సోమవారం మండలంలోని ఉమిత్యాల గ్రామానికి చెందిన కర్రెప్ప, లక్ష్మమ్మల కూతురు ఇందిర నాలుగు రోజుల క్రితం పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకుని జిల్లా ఐద్వా కార్యదర్శి నర్మద బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి మాట్లాడారు. వారి వెంట కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు మాద్రెప్ప, మండల అధ్యక్షుడు కర్రెప్ప, వీరేష్, తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశంలో చెత్త వేయకండి

శాంతినగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయకుండా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ సిబ్బంది కోరారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని రామచంద్రానగర్ కాలనీలో సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించారు. ఇళ్లముందు నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



రామచంద్రానగర్ కాలనీ వాసులకు
అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రైతుల సమస్యలపై జాప్యం వద్దు



నూతన తహసీల్దార్‌కు
సన్మానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజోళి: కార్యాలయాలకు వచ్చే రైతుల సమస్యలపై జాప్యం చేయొద్దని అలంపూర్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్ అన్నారు. రాజోళి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రామ్మోహన్‌ను కలిశారు. తహసీల్దార్‌తో మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రైతులు భూసమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, వారికి వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి, దేవన్న, గోవిందు, తదిదరులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రామ్మోహన్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ రెడ్డి, నాయకులు కలిశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, తిరుమలేష్, రాజేష్, గోవిందు రాజులు, అడివిస్వామి పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

ఎర్రవల్లి: అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి రెండు వాహనాల్లో అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను పీఎస్‌కు తరలించి డ్రైవర్లు ఎరుకలి రవి, ఎరుకలి ఎల్లప్పలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వచ్ఛత సేవతో సమానం

మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: పరిసరాల స్వచ్ఛతగా ఉంచడం అంటే సేవతో సమానమని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించుకోవడానికి స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. చెట్లను మనం రక్షిస్తే ప్రకృతి మనలను సంరక్షిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులు మద్దిలేటి, వెంకట్రాముడు, రామకృష్ణ, షేక్షావలి, రహిమతుల్లా, ఆంజనేయులు, రామచంద్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సామెల్, మున్సిపల్ సిబ్బంది హరిప్రసాద్, జయరాముడు, లక్ష్మన్న ఉన్నారు.



అలంపూర్ మున్సిపాలిటీలో మొక్కలు
నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



ఉండవెల్లిలోని మాట్లాడుతున్న సీఐ రవిబాబు



గార్లపాడులో మాట్లాడుతున్న ఎస్‌ఐ సుకూర్

ధరూరు: పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సుకూర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గార్లపాడులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్యవివాహ నిరోధక చట్టం, సైబర్ క్రైం, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల కలిగే నష్టాలపై వివరించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడారు. పిల్లలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. బాల, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్, ప్రసూన, సుధాకర్, శ్వేత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, చెడు అలవాట్లపై సీఐ రవిబాబు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు రకాల మోసాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు మద్దిలేటి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజోళి: మత్తు, మత్తుతో కూడిన పదార్థాలు జీవితాన్ని చిత్తు చేస్తాయని ఎస్‌ఐ జగదీష్ అన్నారు. మండల కేంద్రం రాజోళిలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువకులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు.

కేటీదొడ్డి: బాలికల బంగారు భవిష్యత్‌కు వెలుగులు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలపై జరిగే లైంగిక నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మల్దకల్: బాలికల భవిష్యత్‌కు వెలుగులు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్‌ఐ నందీకర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలికలకు లైంగిక నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నర్సింహులు, రామాంజనేయులు గౌడ్, గోవర్ధన్‌శెట్టి, భాగ్యలక్ష్మి, తిమ్మోతి, ఏఎస్‌ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అలంపూర్‌రూరల్: విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వెంకటస్వామి అన్నారు. మండలంలోని లింగవాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు తదితరులు ఉన్నారు.



కోదండాపురంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ స్వాతి

మానవపాడు: పిల్లలు, మైనర్లపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని సీఐ టాటా బాబు సూచించారు. మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో పోక్సోచట్టంపై అవగాహన కల్పించారు.

ఎర్రవల్లి: ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్, కోదండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోదండాపురం ఎస్‌ఐ స్వాతిలు బాలికలకు లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గద్వాల క్రైం: మహిళలు, చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులపై నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని పట్టణ, రూరల్ ఎస్‌ఐలు కల్యాణ్‌కుమార్, శ్రీకాంత్‌లు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ధరూరు: సంఘటిత కార్మిక రంగంలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో మండల సీఐటీయూ నాయకులతో కలిసి మాట్లాడారు. గత కొన్ని దశాబ్దాలుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ రంగంలో పని చేస్తున్న కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారన్నారు. వారికి కనీస వేతనాలు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ పోరాటం చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ధరూరులో కర పత్రాలను విడుదల చేస్తున్న
సీఐటీయూ నాయకులు

కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింహులు, దేవదాసు, తిమ్మప్ప, గోవిందు, రాము, పాంటన్న, ఆంజనేయులు, మోష, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు స్థలాలు చూపండి



వినతి పత్రంతో టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు

అలంపూర్: వరద బాధితులకు ఇళ్ల స్థలాలు చూపాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిపోగు ప్రేమదాసు కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్‌ను సోమవారం ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. 2009 అక్టోబర్‌లో సంత మార్కెట్‌లో కాలనీ ముంపునకు గురైనట్లు వినతిలో పేర్కొన్నారు. సర్వం కోల్పోయిన వరద బాధితులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని భరోసా కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. పట్టాలు ఇచ్చినప్పటికీ స్థలాలు ఎక్కడో చూపలేదని పేర్కొన్నారు. సమస్యను వివరించడంతో కలెక్టర్ స్పందించి మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. వారం రోజుల్లో స్థానిక రెవెన్యూ అధికారి సమస్యను పరిష్కరిస్తారని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు జయన్న, రాజు, శేఖర్, తదితరులు ఉన్నారు.

నిషేధిత కల్లు విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి

గద్వాల క్రైం: నిషేధిత కల్లు విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గొంగళ్ల రంజిత్‌కుమార్ గద్వాల ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్తీ కల్లు తయారీకి వినియోగించే మత్తు పదార్థాలు నిలువరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, యువత గంజాయి, మత్తు కలిగించే పదార్థాలకు అలవాటు పడుతున్నారన్నారు. ఇటీవల బాలికలపై దాడులకు పాల్పడిన వారు నిషేధిత, మత్తు కలిగించే వాటిని తీసుకున్నట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చిందన్నారు. నార్కోటిక్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసిన క్రమంలో నిషేధిత కల్లుగా గుర్తించి ముగ్గురిపై కేసులు నమోదు చేసినా వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆల్ప్రజోం, డైజోఫాం, సీహెచ్ తదితర వాటిని నివారించాలన్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, ప్రేమ్‌రాజ్, రంగస్వామి ఉన్నారు.



గద్వాల ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డికి వినతి పత్రం
అందజేస్తున్న రంజిత్‌కుమార్, నాయకులు